సాక్షి ఒడిశా

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,35,630లు, బంగారం 3గ్రాముల 150 మిల్లీగ్రాములు, వెండి 24 గ్రాముల 440 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

మరో మూడు స్థానాలకు బీజేడీ అభ్యర్థులు ఖరారు

శాసనసభ ఎన్నికలు పురస్కరించుకుని అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) మరో మూడు అసెంబ్లీ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. - 8లో



పూరిలో అతిసార..?

పూరీ పట్టణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అనుమానాస్పద అతిసార వ్యాప్తిపై భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

వికాసం పేరుతో వినాశనం

- బీజేపీ సీనియర్ నేత డాక్టర్ ప్రదీప్ పాణిగ్రాహి



మాట్లాడుతున్న ప్రదీప్ పాణిగ్రాహి

బరంపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 20 ఏళ్ల పాలనలో వికాసం పేరుతో ఒడిశా రాష్ట్రాన్ని వినాశనం చేశారని బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ ప్రదీప్ పాణిగ్రాహి తీవ్రంగా ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక గాంధీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గంజాం జిల్లాలో 80 శాతం మంది వ్యవసాయ రైతులు ఉన్నారన్నారు. రైతులతో పాటు జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన వివిధ పథకాలను రాష్ట్రంలోని అధికార బీజేడీ ప్రభుత్వం అమలు చేయకుండా పక్షపాత వైఖరి అవలంబిస్తోందన్నారు. బీజేడీ నిర్లక్ష్య పాలన కారణంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయావన్నారు. ఖరీఫ్‌లో పంటలను నష్టపోయిన రైతులకు రుణాలు మాఫీ చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. చనిపోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పటి వరకూ చెల్లించకపోవడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు. అధికార పార్టీ బీజేడీ పాలన తీరుతో వ్యవసాయరంగం కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుభాష్ సాహు, కె.అనిల్‌కుమార్, యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి సునిల్ సాహు, సినీ నటుడు సిద్ధంత్ మహాపాత్రో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ప్రమాద దృశ్యం


రాయగడ: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరి గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వచ్చిన బైకు, బొలేరో వాహనం ఢీకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఉషాపాడు గ్రామం నుంచి వస్తున్న బొలేరో వాహనం టికిరి వైపు వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బొలేరో వాహన డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన యువకుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు యువకుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దార్యాప్తు చేస్తున్నారు. యువకుని వివరాలపై ఆరా తీస్తున్నారు.

శబరి నదిలో యువకుడి గల్లంతు..?



నదిలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌లో పూజలు చేసేందుకు వెళ్లిన తమ కుమారుడు జితేంద్ర కుమార్ నాయిక్(37) శబరి నదిలో గల్లంతయ్యాడని జయపురం సమితి అంబాగుడ గ్రామానికి చెందిన రాజేంద్ర నాయిక్ జయపురం సదర్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. దీంతో బొయిపరిగుడ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. నది వద్ద పోలీసులు ఒక బైక్, ఒక బ్యాగ్‌లో పర్సు, ఆధార కార్డు, పాన్ కార్డు, పూజ చేసిన సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది శబరి నదిలో గల్లంతైన నాయిక్ కోసం గాలిస్తున్నట్లు సమాచారం. అయితే ఇంతవరకు నాయిక్ ఆచూకీ తెలియలేదని బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ వెల్లడించారు.



మే 2 వరకు.. వడగాల్పుల తీవ్రత

- ఐఎండీ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్

భువనేశ్వర్:

వేడి గాలులతో రాష్ట్రంలో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం పూట గడప దాటేందుకు వెనుకంజ వేస్తున్నారు. పొడిగాలుల కారణంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మరో నాలుగు రోజుల పాటు తీవ్రమైన వేడి గాలులు పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని, పలు ప్రాంతాల్లో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత 2 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశం ఉందని స్థానిక ఐఎండీ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ విలేకరుల సమావేశంలో శనివారం తెలిపారు. ఈ నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశం ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో కాలవైశాఖి వాతావరణానికి అవకాశం ఉన్నప్పటికీ మే 2 వరకు వేడిగాలుల పరిస్థితి కొనసాగుతుంది. కాలవైశాఖి వర్షం పగటిపూట ఉష్ణోగ్రతను ప్రభావితం చేయకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

పలు ప్రాంతాల్లో వర్షం

దక్షిణ ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో కాలవైశాఖి వర్షం శుక్రవారం కురిసింది. నవరంగ్‌పూర్‌లో అత్యధికంగా 9.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. రానున్న 24 గంటలపాటు పలు జిల్లాలకు తీవ్రమైన వేడిగాలులుల వాతావరణం నేపథ్యంలో హీట్ వేవ్ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించారు. మరో నాలుగు రోజుల్లో వాతావరణ వ్యవస్థలో పెద్ద మార్పు వచ్చే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ భావిస్తుంది. వేడిగాలులుల నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు పగటిపూట ఇంట్లోనే ఉంటూ వడగాడ్పుల నుంచి రక్షణ పొందాలని అభ్యర్థించారు.

భువనేశ్వర్‌లో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత

రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు గరిష్ఠ ఉష్ణోగ్రత 44.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ సీజన్‌లో తొలిసారిగా భువనేశ్వర్‌లో ఉష్ణోగ్రత 44 డిగ్రీల సెల్సియస్‌ను దాటింది. ఝూర్సుగుడలో మధ్యాహ్నం 2.30 గంటల సమయానికి 43.6 డిగ్రీల సెల్సియస్, రౌర్కెలాలో 42.5 డిగ్రీల సెల్సియస్, చాంద్‌బాలీలో 42.4 డిగ్రీల సెల్సియస్, సంబల్‌పూర్‌లో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. స్థానిక వాతావరణ కేంద్రం అంచనా ప్రకారం రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో చాలాచోట్ల పగటి ఉష్ణోగ్రత 2 డిగ్రీల సెల్సియస్ పైబడి పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. పర్యవసనంగా రాబోయే 4 నుంచి 5 రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 4 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ పైబడే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

రెడ్ అలెర్ట్

వాతావరణ కేంద్రం అనేక ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మయూర్‌భంజ్, జాజ్‌పూర్, కెంజొహర్, అంగుల్, ఢెంకనాల్, బౌధ్, సుందర్‌గడ్, ఝార్సుగుడ, ఖుర్దా మరియు కటక్‌లలో వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉంటుందని ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. అదేవిధంగా దేవ్‌గడ్, సంబల్‌పూర్, సోన్‌పూర్, బొలంగీర్, నువాపడా, కలహండి, కందమాల్, నయాగడ్, రాయగడ, భద్రక్, బాలాసోర్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, మల్కన్‌గిరి, గంజాం, గజపతి జిల్లాల్లో వేడిగాలులు వీస్తాయని ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

'రెండు నెలల్లో బకాయి వేతనాల చెల్లింపులు'

జయపురం:

నియోజకవర్గంలో బీజేడీ అభ్యర్థి ఇందిరా నందో విజయం సాధిస్తే, రెండు నెలల్లోనే సేవా పేపర్ మిల్లు పూర్తిస్థాయిలో నడిచేలా చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి రబినారాయణ తెలియజేశారు. రాజుసాహిలోని బీజేడీ కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విజయం సాధిస్తే మిల్లు నడవడమే కాకుండా, కార్మికులకు యాజమాన్యం చెల్లించాల్సిన వేతన బకాయిలు, ఇతరత్రా చెల్లింపుల డిమాండ్‌లు అమలు జరుగుతాయన్నారు. అలాగే విశ్రాంత కార్మికులు, మరణించిన కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత 10 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నటువంటి తారాప్రసాద్ చర్యలు తీసుకోకపోవడం వలనే ప్రస్తుతం కార్మికులకు ఈ స్థితి ఏర్పడిందని మండిపడ్డారు. అలాగే ఇందిరా నందో గెలిస్తే భవిష్యత్‌లో వ్యవసాయ శిక్ష హబ్ ఏర్పాటు చేస్తామని, ఆధునిక వ్యవసాయ సంబంధిత యంత్రాల కర్మాగారం స్థాపించడం జరుగుతుందని వెల్లడించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ ఎ.శ్రీనివాసరావు, పార్టీ జయపురం బ్లాక్ ఉపాధ్యక్షులు గణేష్ ప్రసాద్ పాఢీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి రబినారాయణ నందో తదితరులు

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జయపురం: త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో బొయిపరిగుడ- మల్కనగిరి మార్గం, విజయవాడ- రాంచీ 326 జాతీయ రహదారిలోని మంత్రిఅంబ వద్ద పోలీసులు, ఎస్.ఎస్.టి జవాన్‌లు శనివారం వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎన్నికల ప్రధాన అధికారి, కొరాపుట్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బొయిపరిగుడ ఎన్నికల అధికారి భాస్కరచంద్ర సాహు పర్యవేక్షణలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మంత్రిఅంబ, బొయిపరిగుడ, కుంద్ర, కొట్‌పాడ్ ప్రాంతాల్లో మూడు ఎస్.ఎస్.టి టీమ్‌లు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నాయని, మల్కనగిరి జిల్లా సరిహద్దు ఛత్తీష్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌కు రాకపోకలు జరుపుతున్న అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు భాస్కరచంద్ర సాహు వెల్లడించారు. ఈ తనిఖీలు ఎన్నికలు ముగిసేవరకు నిర్వహిస్తామన్నారు.

పోటాపోటీగా చేరికలు



బీజేడీలో చేరినవారితో మాజీ మంత్రి రబినారాయణ నందో

జయపురం: ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో జయపురం నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక పక్క ప్రచారం సాగిస్తూనే, మరోవైపు వివిధ పార్టీల నుంచి కార్యకర్తలను తమ పార్టీలో చేర్చుకునేందుకు మిశ్రణ పర్వ్‌లు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బీజేడీ నేత, మాజీ మంత్రి రబినారాయణ నందో, కాంగ్రెస్ నేత జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతిలు మిశ్రణ పర్వ్‌లు నిర్వహిస్తుండడం చర్చనీయాంశమైంది. శనివారం బీజేడీ నేత రబినారాయణ నందో రాజుసాహిలోని బీజేడీ కార్యలయంలో మిశ్రణ పర్వ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి దాదాపు 20 మంది బీజేడీలో చేరారు. అదేవిధగా ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి నివాసంలో నిర్వహించిన మిశ్రణ పర్వ్‌లో పలువురు బీజేడీ, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెల్‌లో చేరారు. బాహిణీపతి కొత్తగా చేరినవారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత నాయిక్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే బాహిణీపతి

దోపిడీ యత్నం విఫలం



అరెస్టయిన దుండగులతో పోలీసులు

- ముగ్గురు అరెస్టు
- ఒకరి పరార్
- నాటు తుపాకీ, కత్తులు, బాంబులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

బరంపురం: దారి దోపిడీకి ప్రయత్నిస్తున్న ముఠా పోలీసులకు చిక్కింది. బరంపురం జిల్లా హల్దిపదర బస్టాండ్ సమీపం కనిసి గ్రామం దగ్గర జాతీయ రహదారిలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో దోపిడీకి యత్నిస్తున్న ముఠా అనూహ్యంగా వారికి చిక్కడం ఈ ప్రాంతంలో సంచలనమైంది. ఐఐసీ అధికారి చిత్రరంజన్ బెహరా అందించిన సమాచారం ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి గొళంతర పోలీసుస్టేషన్ పరిధిలోని హలిపదర బస్టాండ్ కనిసి గ్రామం దగ్గర 16వ జాతీయ రహదారిలో చైతన్యపడా గ్రామం దగ్గర జంక్షన్‌లో గల బస్ షెల్టర్ అర్ధరాత్రి సమయంలో కొంతమంది కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో గొళంతర పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు వారిపై అనుమానం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా దోపిడీకి వ్యూహం పన్నుతున్నట్టు తేలింది. ఈ సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేయగా.. ఒకరు పరారైనట్టు పోలీసు అధికారి వెల్లడించారు. అరెస్టయిన వారిని నుంచి ఒక సింగిల్ రౌండ్ తుపాకీ, రెండు కత్తులు, రెండు మోటార్ సైకిళ్లు, రెండు నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. అరెస్టయిన వారిలో గుసానినువాగంకి చెందిన శిబరామ్ పాలో, లాటి గ్రామనికి చెందిన శ్యామ్ సుందర్ గాడొ, పింకు దాస్‌లుగా గుర్తించామన్నారు. వీరికి గంజాం, గజపతి జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన దోపిడీలతో సంబంధం ఉన్నట్టు ఐఐసీ అధికారి స్పష్టం చేశారు. కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీ, కత్తులు, బాంబులు

పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ కోచింగ్

- ప్రభుత్వం నిర్ణయం

భువనేశ్వర్: రాష్ట్రంలో వేడిగాలుల పరిస్థితుల దృష్ట్యా, రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక, ఉన్నత మాధ్యమిక పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులను ప్రకటించింది. అయితే విద్యాబోధన అనుబంధ కార్యక్రమాలు నిరవధికంగా కొనసాగించాలని నిర్ణయించింది. సెలవుల సమయాన్ని సద్వినియోగం చేసుకుని నీట్, జేఈఈ వంటి ఉన్నత చదువుల ప్రవేశ పరీక్ష కోసం సన్నద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు ప్రకటించింది. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాలు మినహా నీట్, జేఈఈ అభ్యర్థులకు ఉదయం పది గంటల వరకు ఆన్‌లైన్‌లో కోచింగ్ ఇవ్వాలని ఉన్నత మాధ్యమిక విద్యాశాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేసింది. సెలవుల్లో విద్యార్థుల్లో నిరంతర సాధన ప్రేరణ కోసం క్లాస్ టీచర్ హోంవర్క్‌ను కేటాయిస్తారు. ఏదైనా సందేహం ఉంటే విద్యార్థులు సంబంధిత సబ్జెక్ట్ టీచర్‌ని లేదా క్లాస్ టీచర్‌ని ఫోన్‌లో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. అవసరమైన చోట క్లాస్ టీచర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో చర్చిస్తారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది రోస్టర్ డ్యూటీలో ఉంటారు. అన్ని వివరాలు ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. అడ్మిషన్ల కార్యకలాపాల కోసం కార్యాలయం పని దినాల్లో నిత్యం ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు తెరిచి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వదిలి వెళ్లరాదని ఉన్నత మాధ్యమిక పాఠశాలల ప్రాచార్యులు, ఇతర సిబ్బందిని డైరెక్టరేట్ ఆదేశించింది.

బీజేపీ మరో జాబితా విడుదల

భువనేశ్వర్:

రాష్ట్రంలో మరో 8 అసెంబ్లీ స్థానాలకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శనివారం అభ్యర్థులను ప్రకటించింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు పురస్కరించుకుని బీజేపీ అభ్యర్థుల నాల్గో జాబితాను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఖరారు చేసినట్లు ప్రకటించారు. ఖుర్దా శాసనసభ నియోజకవర్గానికి సీనియర్ నాయకుడు ప్రశాంత కుమార్ జగదేవ్, సాలేపూర్ స్థానానికి ఓలీవుడ్ నటుడు అరిందమ్ రాయ్ పేర్లను బీజేపీ ప్రతిపాదించింది. నాల్గో అభ్యర్థుల జాబితా ఇలా ఉంది.

నియోజకవర్గం	అభ్యర్థి
తెల్కోయ్ (ఎస్టీ)	డా.ఫకీర్ మోహన్ నాయక్
చంపువా	మురళీ మనోహర్ శర్మ
బొస్తా	రబీంద్ర ఆండియా
బాసుదేవ్‌పూర్	బాణీకల్యాణ్ మహంతి
హిందోల్ (ఎస్సీ)	సీమరాణి నాయక్
సాలేపూర్	అరిందమ్ రాయ్
కేంద్రాపడా (ఎస్సీ)	గీతాంజలి సెఠి
ఖుర్దా	ప్రశాంత కుమార్ జగదేవ్

మెడికల్ కాలేజ్ ఏర్పాటుకు కృషి

- కొరాపుట్ ఎంపీ అభ్యర్థి సప్తగిరి



అభివృద్ధి పనులకు సంబంధించి ప్రోగ్రస్ కార్డు విడుదల చేస్తున్న ఎంపీ సప్తగిరి, తదితరులు

రాయగడ: తనకు మరొసారి అవకాశం కల్పిస్తే రాయగడలో మెడికల్ కాలేజ్ ఏర్పాటుకు కృషి చేస్తానని కొరాపుట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. శనివారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేడీ, కేంద్రంలో బీజేపీ పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వీరి పాలనలో విసుగెత్తిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సన్నద్ధమవుతున్నారని జోష్యం చెప్పారు. కొరాపుట్ ఎంపీగా గత ఐదేళ్లలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఉలక ప్రోగ్రస్ కార్డును ఈ సందర్భంగా విడుదల చేశారు. ఆదివాసీలు, హరిజనులు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో నెట్‌వర్క్ సమస్యతో సతమతవుతుండేవారని, ఈ సమస్యపై పార్లమెంటులో గళమెత్తి 1482 మొబైల్ టవర్లను ఏర్పాటు చేయించానన్నారు. మెడికల్ కళాశాల కోసం తనవంతు కృషి చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి డీపీఎను సకాలంలో సమర్పించకపోవడంతోనే అవాంతరం ఏర్పడిందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని ఈ రెండు పార్టీలకు ప్రజలు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతారని ఉలక అన్నారు.

కాసీపూర్‌లో మెగా ప్రాజెక్టు ఏర్పాటు..

జిల్లాలోని కాసీపూర్ సమితిలో గల కంసారిగుడలో అలూమిన కర్మాగారం ఏర్పాటుకు తాను ప్రజల మద్దతుతో పోరడడంతో నేడు ఆ కర్మాగారం ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని ఉలక వివరించారు. ఈ కర్మాగారం ఏర్పాటైతే యువకులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. గత ఐదేళ్లలో ఈ సమితి అభివృద్ధి కోసం తాను ఎంతో శ్రమించాల్సి వచ్చిందని, ఇక్కడి సమస్యలను పార్లమెంట్ వరకు తీసుకువెళ్లి పరిష్కారమార్గాలకు సహకరించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా, డీసీసీ సాధారణ కార్యదర్శి శంకర్షన్ మంగరాజ్, రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అప్పలస్వామి కద్రక తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: పట్టణంలోని జమాల్ వీధిలో ఉన్న శ్రీరామ మందిరంలో నిర్వహించస్తున్న శ్రీరామ నవరాత్రి కల్యాణ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల సందర్భంగా శనివారం పూర్ణాహుతి హోమం నిర్వహించారు. ప్రముఖ వ్యాపారి మద్ది రామకృష్ణ దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.నాగరాజు, కార్యదర్శి సానా జగదీష్ తదితరులు హోమం నిర్వహించారు.ఏ అనంతరం కలశ ఉద్వాసన జరిపారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ పూజారి ఉలిమిరి నాగేశ్వరరావు శాస్త్రోత్తంగా నిర్వహించారు.

ఘనంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం



శ్రీరామపట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చక బృందం

పర్లాకిమిడి: శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవాన్ని స్థానిక కోమటివీధి రామాలయంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అందవరపు శ్రీనివాసరావు దంపతులు, పాట్నూరు హరినారాయణ దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు అనుమంచుపల్లి రాజగోపాలచారి పట్టాభిషేకాన్ని జరిపించారు. ఈ మహోత్సవాన్ని చూడటానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

బోటు బోల్తా ఘటనపై నోటీసులు

భువనేశ్వర్: మహానదిలో పడవ బోల్తాపడి 8 మంది మృతి చెందిన ఘటనపై ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నోటీసులు జారీ చేసింది. ఈ విషాద ఘటనపై రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఒడిశాలోని ఝార్సుగుడ, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్ ప్రాంతాల పోలీసు సూపరింటెండెంట్లు చేపట్టిన చర్యల నివేదికను దాఖలు చేయాలని పేర్కొంది. నోటీసులు అందిన ఆరు వారాల్లోగా నివేదికలను సమర్పించాలని రెండు రాష్ట్రాల అధికారులను కోరింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్ జిల్లా ఖరాసియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అంజోరిపల్లి గ్రామానికి చెందిన 8 మంది వ్యక్తులు ఈ నెల 20న ఝార్సుగుడ జిల్లాలోని మహానదిలో పడవ బోల్తా పడటంతో మునిగిపోయారు. 50 మంది ప్రయాణికులతో మాపాథారోసేణి మందిర్ నుంచి ఝార్సుగుడ రెంగాలిలోని శారద ఘాట్‌కు తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ అదుపుతప్పి పడవ బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది ప్రయాణికులు గల్లంతయ్యారు. గాలింపు చర్యల్లో మృతదేహాల్ని ఒడ్డుకు చేర్చిన విషయం తెలిసిందే. వీరిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు బాలురు ఉన్నారు. పడవ బోల్తా పడిన వెంటనే, స్థానిక మత్స్యకారులు సహాయక చర్యచేపట్టి పలువురిని రక్షించారు. ఏడుగురు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఒకరు మృతి చెందినట్లు గుర్తించారు. మరుసటి రోజు, స్కూబా డైవర్లు, భువనేశ్వర్ నుంచి ఒడిశా విపత్తు స్పందన చర్యల దళం ఒడ్రాఫ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ దళం హిరాకుడ్ రిజర్వాయర్ నుంచి ఏడు మృతదేహాలను వెలికితీసింది.

డిగ్రీ మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. ఫలితాలు జ్ఞానభూమిలో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్షకు 1462 మంది హాజరు కాగా 606 మంది ఉత్తీర్ణత సాధించారు. బీఎస్సీలో 1141 మందికి 469 మంది, బీఏలో 162 మందికి 57 మంది, బీకాం (ఒకేషనల్)లో 80 మందికి 40 మంది, బీకాం(జనరల్)లో 78 మందికి 40 మంది ఉత్తీర్ణత సాధించారు. 15 రోజుల్లోగా రీవేల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని డీన్ సూచించారు.

భువనేశ్వరి వ్యాఖ్యలు దారుణం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి దళితులను దుర్భాషలాడటం దారుణమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు పడపాన సుగుణారెడ్డి అన్నారు. శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దళితులను కించపరుస్తూ మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు సైతం ఎవరైనా ఎస్సీ కులంలో పుట్టాలనుకుంటారా అని చేసిన వ్యాఖ్యలు ఆయనలో పెత్తందారీ దురంహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం కొరపాన కళ్యాణిపై దాడి చేసిన ఘటనలు చూస్తే టీడీపీ నాయకులు దళితుల పట్ల ఎంత చిన్నచూపు చూస్తున్నారో తెలుస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులు టీడీపీకి ఓట్లతో బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో గుంట జ్యోతి, యామిజాల గాయిత్రీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



బాలాజీ వసంతోత్సవం

భువనేశ్వర్:

ఖుర్దా రోడ్డు అకౌంట్స్ కాలనీ గల వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సాల సందర్భంగా శనివారం గోవింద నామ స్మరణతో మార్మోగింది. స్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి జరిగిన కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంగళ ధ్వనితో ఆరంభమైన పూజలు వేద స్వస్తితో ముగిశాయి. కల్యాణోత్సవం పురస్కరించుకుని అర్చకుల ఆటపాటలు, సనాతన ధర్మ విలువలతో కూడిన ఆచార వ్యవహారాల వ్యాఖ్యానాలు భక్తుల్ని ఆకట్టుకున్నాయి. భక్తులకు దర్శనంతోపాటు ఉచిత ప్రసాదాలు సరఫరా చేయడంలో కార్యకర్తలు స్వచ్ఛందంగా పాలుపంచుకుంటున్నారు. వృద్ధులకు చక్రాల కుర్చీ వంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో నిర్వాహకవర్గం ప్రశంసలు అందుకుంది.



కల్యాణోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి



ఆటపాటలతో కల్యాణ వేదికకు తరలి వస్తున్న శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులు

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న గజపతి చాంబర్స్ ఆఫ్ కామర్స్ సభ్యులు

పర్లాకిమిడి: పట్టణంలో మార్కెట్ జంక్షన్ వద్ద గజపతి చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గజపతి చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పాట్నూరు రామకృష్ణ, జామి సోమేశ్వరరావు, మహేష్, తదితరులు పాల్గొని సహకరించారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ సిబ్బంది

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో..

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున శనివారం బ్యాంక్ ఆవరణంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. బ్యాంక్ మేనేజర్ దేవ్‌దత్త్ శెట్టి మజ్జిగ అందజేశారు. ప్రతీరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మజ్జిగ, నిమ్మరస, రస్నా ఇలా ఏదో ఒక శీతలపానీయం అందజేస్తామని తెలిపారు. బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పూరిలో అతిసార..?

- ఇప్పటికే ఇద్దరు మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

భువనేశ్వర్: పూరీ పట్టణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అనుమానాస్పద అతిసార వ్యాప్తిపై భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అతిసార లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు మరణించడంతో ఈ పరిస్థితి నెలకొంది. అయితే వీరి మరణానికి గల కారణాలు ధ్రువీకరించాల్సి ఉందని వైద్య వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా మరో 30 మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత కొన్ని రోజులుగా బలిసాహి, రెడ్‌క్రాస్ రోడ్ ప్రాంతాలతో సహా పట్టణంలోని అనేక ప్రాంతాల్లో అతిసార పీడితులు బాధపడుతున్నట్లు సమాచారం. వీరంతా నీళ్ల విరేచనాలు, వాంతులు, వికారం వంటి లక్షణాలతో చికిత్స కోసం ఆస్పత్రిలో చేరుతున్నారు. ఈ క్రమంలో 2 మంది వ్యక్తులు మరణించడంపై ఆందోళన చెందుతున్నారు. మృతులు బాసంతి దాస్, పద్మచరణ్ ఖుంటియాగా గుర్తించారు. వీరిరువురు 70 ఏళ్లు పైబడిన వారని, మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని వైద్యులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



లక్ష్మణరావు(ఫైల్)

నరసన్నపేట: మండలంలోని నడగాం గ్రామానికి చెందిన తమరాపు లక్ష్మణరావు(40) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన లక్ష్మణరావు ఓ ప్రయివేటు కంపెనీలో లైన్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో ఎల్‌సీ తీసుకోవడంలో జరిగిన పొరపాటు కారణంగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం విషయం తెలియడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. లక్ష్మణరావుకు భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మణరావు మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు లుకలాపు రవి సంతాపం వ్యక్తం చేశారు.

దర్జీలకు అండగా బీజేడీ ప్రభుత్వం



లేడీ దర్జీలతో సెల్ఫీలకు దిగుతున్న రూపేష్ పాణిగ్రాహి

- రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: దర్జీలను అన్నివిధాలా ఆదుకున్న ఘనత బీజేడీ ప్రభుత్వానికే దక్కిందని ఆ పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి అన్నారు. స్థానిక రాయిచెట్టు జంక్షన్‌ ఆశీర్వాద్ ఫంక్షన్ హాలులో లేడీ టైలర్లు, ఇతర దర్జీలతో శనివారం సమావేశం అయ్యారు. కుట్టుమిషన్లతో జీవనోపాధి సాగిస్తున్న దర్జీల కుటుంబాలు.. వారి పిల్లలకు అధికార బీజేడీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను మహిళా దర్జీలు, ఎనిమిదో వార్డు కౌన్సిలరు కోవెలకోండ వరదరాజు ఇతర టైలర్లు దుశ్శాలువతో సత్కరించారు.



దర్జీలతో మాట్లాడుతున్న బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి

బంగారం కోసం వృద్ధురాలి హత్య?

- మూడు రోజుల కిందట అదృశ్యమై డ్రైనేజీలో శవమై తేలిన వైనం
- అనుమానితురాలిని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు
- అమలపాడులో విషాదం

వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడులో ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతిచెందింది. మృతురాలు ధరించిన సుమారు 10 తులాల బంగారం కోసం అదే గ్రామానికి చెందిన ఓ మహిళే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అమలపాడు గ్రామానికి చెందిన దున్న ఎర్రన్న భార్య దున్న దమయంతి(60) ఈ నెల 24న టిఫిన్ చేసేందుకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరానికి ఎదురుగా ఉన్న మూతబడిన డ్రైనేజీ నుంచి దుర్వాసన వస్తున్నట్లు అక్కడ పని చేస్తున్న తాపీమేస్త్రీలు గుర్తించారు. విషయం వజ్రపుకొత్తూరు పోలీసులకు తెలియజేయడంతో ఎస్‌ఐ రామారావు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం దున్న దమయంతిదే కావడంతో కుమారులు కృష్ణారావు, రామారావు, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. తన తల్లి ధరించిన పది తులాల బంగారం కనిపించకపోవడంతో వాటి కోసమే హత్య జరిగి ఉంటుందని పోలీసులకు తెలియజేశారు.



దున్న దమయంతి (ఫైల్)

ఆమె పనేనా..

కాగా వృద్ధురాలి హత్య వెనుక ఇదే ప్రాంతంలో నివాసముంటున్న ఓ మహిళ హస్తమున్నట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. వృద్ధురాలు అదృశ్యమైన రోజు సదరు మహిళ ఆమె వద్దకు వెళ్లినట్లు కొందరు గుర్తించారు. మృతదేహం బయటపడటంతో వెంటనే ఆమెను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతురాలి కుమారుడు కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సీహెచ్.రామారావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు జరుగుతుందని ఎస్‌ఐ తెలిపారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు. కాగా మృతురాలి మృతదేహాన్ని తీసేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ సీహెచ్. రామారావు తానే స్వయంగా డ్రైనేజీలోకి దిగారు. చనిపోయి మూడు రోజులు కావడంతో ఓ వైపు దుర్వాసన వెదజల్లుతున్నా ధైర్యంగా మృతదేహం వెలికితీసి గాయాలు పరిశీలించారు.



మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎస్‌ఐ రామారావు

శతాధిక వయో వృద్ధులకు సన్మానం



గౌరచంద్ర పాఢిని సన్మానిస్తున్న దృశ్యం



గుణమంజూరి బెవర్తను సన్మానిస్తున్న అధికారులు

రాయగడ: వృద్ధులకు గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం వినూత్న కార్యక్రమం చేపట్టింది. జిల్లాలోని గుణుపూర్‌లో ఇద్దరు శతాధిక వయో వృద్ధులను శుక్రవారం సన్మానించింది. జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ కౌర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ మధుసూధన్ మాఝి, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి మనోజ్ కుమార్ తండిలు గుణుపూర్‌లో నివసిస్తున్న గుణమంజూరి బెవర్త (107)చ గౌరచంద్ర పాఢి(104)ల ఇంటికి స్వయంగా వెళ్లి సత్కారం చేశారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఈ తరహా కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం

బీజేడీలో పలువురి చేరిక



నెక్కంటి సమక్షంలో బీజేడీలోకి చేరిన మహిళలు

రాయగడ: బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరావు, ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సర్మిష్టా పాడీల నేతృత్వంలో శనివారం స్థానిక 24 వార్డుకు చెందిన మహిళలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను వేసి నెక్కంటి ఆహ్వానించారు. నవీన్ పట్నాయక్ హయాంలో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని, వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేశారని నెక్కంటి అన్నారు. బీజేడీ పాలనలో ఎంతో మంది మహిళలు ఆర్థిక స్వావలంబన పొందడంతో వారి జీవనవిధానంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. వీటిని ప్రేరణగా తీసుకున్న ఎంతో మంది మహిళలు స్వయంగా పార్టీలో చేరేందుకు ఉత్సాహాన్ని చూపిస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పార్టీ విజయానికి సహకరించాలని కోరారు.

బైక్‌ల చోరీ నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో రశ్మీరంజన్ ప్రధాన్

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీసులు ద్విచక్ర వాహనాల చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఎస్డీపీవో రశ్మీరంజన్ సేనాపతి చందిలి పోలీసుస్టేషన్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 23వ తేదీన పెంట గ్రామానికి చెందిన బి.లబనారాయణ అనే వ్యక్తి జేకేపూర్‌లోని ఐఓబీ బ్యాంకు ఎదురుగా తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి బ్యాంకు పనులపై వెళ్లాడు. అయితే పనులు ముగించుకుని తిరిగి వచ్చి చూడగా తన వాహనం కనిపించకపోవడంతో చందిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌కు చెందిన రవీంద్ర కౌసల్య (30), కలహండి జిల్లాలోని బీజేపూర్‌కు చెందిన సదానంద సాహులను అరెస్టు చేశారు.

మరో మూడు స్థానాలకు బీజేడీ అభ్యర్థులు ఖరారు

భువనేశ్వర్: శాసనసభ ఎన్నికలు పురస్కరించుకుని అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) మరో మూడు అసెంబ్లీ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆమోదం మేరకు ఈ జాబితా విడుదల చేసినట్లు శనివారం ప్రకటించారు.

సిట్టింగులకు నిరుత్సాహం

బీజేడీ జారీ చేసిన తాజా అభ్యర్థుల జాబితా సిట్టింగ్ సభ్యులకు తీవ్ర అసంతృప్తి కలిగించింది. పాత్రికేయం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగిడిన గౌతమ్ బుద్ధ దాస్‌ని భొగరాయ్ నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అనంత దాస్‌కు చుక్కెదురైంది. అలాగే ఖుర్దా నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే జ్యోతిరింద్ర నాథ్ మిత్రా స్థానంలో రాజేంద్ర సాహుకు అవకాశం కల్పించారు. భొగొరాయ్ సిట్టింగ్ ఎమ్మెల్యే అనంత దాస్ తన కుమారునికి ఈసారి టికెటు చేజిక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఈ నేపథ్యంలో నవీన్ నివాస్ సందర్శించి అధినేత నవీన్ పట్నాయక్‌తో సంప్రదింపులు ఫలప్రదం కాలేదు. 2004 సంవత్సరం నుంచి వరుసగా విజయం సాధించి అనంత దాస్ భొగొరాయ్ నియోజకవర్గం నుంచి 4 సార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆయన 16,875 ఓట్ల ఆధిక్యంతో గెలిపొందారు. ఖుర్దా శాసనసభ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థిగా పోటీ చేసిన జ్యోతిరింద్ర నాథ్ మిత్రా 10,043 ఓట్ల తేడాతో గెలిపొందారు.

మరో 3 స్థానాలపై ఉత్కంఠ

రాష్ట్రంలో త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల కోసం అధికార బిజూ జనతా దళ్ ఇప్పటివరకు 144 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసి విడతలవారీగా జాబితాలు విడుదల చేసింది. రాష్ట్రంలో సమగ్రంగా 147 శాసన సభ స్థానాలు ఉన్నాయి. మరో 3 శాసనసభ స్థానాలకు అభ్యర్థుల జాబితా వెలువడాల్సి ఉంది. ఈ జాబితాలో ఖండపడా, నీలగిరి మరియు కొరేయ్ శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి.

నియోజకవర్గం	అభ్యర్థి
ఖుర్దా	రాజేంద్ర సాహు
బెగుణియా	ప్రదీప్ సాహు
భొగరాయ్	గౌతమ్ బుద్ధ దాస్

లగేజ్ వ్యాన్ ఢీకొని యువకుడు దుర్మరణం

గార:

మండలంలోని తూలుగు జంక్షన్ సమీపంలో ఓ రైసు మిల్లు వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార గ్రామానికి చెందిన ఎం.ఓందత్తకుమార్ (19) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓందత్తకుమార్ స్వగ్రామం నుంచి శ్రీకాకుళం బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా శ్రీకాకుళం నుంచి కొర్ని వెళ్తున్న మినీ లగేజీ వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓందత్తకుమార్‌కు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి తండ్రి రమణమూర్తి, సోదరుడికి ఫోన్ చేసి సమాచారమివ్వగా వారు వచ్చి రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.కృష్ణప్రసాద్ తెలిపారు.



ఓందత్తకుమార్ మృతదేహం

క్లుప్తంగా

స్వీప్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచడం, శతశాతం ఓటింగ్ నమోదు చేయించే దిశగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్య పరిచేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే పింఛన్ దారులు, దివ్యాంగులు, హిజ్రాలు, యువత కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఓటు గొప్పదనాన్ని వివరిస్తూ కలెక్టరేట్ వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి, ఓటింగ్ ప్రక్రియపై పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఫ్లాష్ మాబ్ ద్వారా పెద్ద ఎత్తున యువతను ఆకర్షించి, ఓటు వేయడం పౌరుల బాధ్యతగా ఉద్బోధించారు. స్వీప్ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు, ప్రచార కార్యక్రమాన్ని ఉదృతం చేసేందుకుగాను ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను శనివారం తన చాంబర్లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌లను అన్ని సచివాలయాల్లో ఆర్టీసీ బస్సుల్లో, గ్రామాల్లో అంటించి ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఎస్డీ అనిత, స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిజేరియన్లు అధికంగా చేస్తే చర్యలు

విజయనగరం ఫోర్ట్: ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లు అధికంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించినట్టు చెప్పారు. ఏప్రిల్, మే నెలలో ఎండల తీవ్రత కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాల వారు మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ప్రతి ఆస్పత్రి వారు ఫైర్ ఎన్‌ఓసీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. షార్ట్ సర్క్యూట్ కాకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు.

లక్షా 40వేలు పట్టివేత

విజయనగరం క్రైమ్: ఎటువంటి ఆధారాల్లేకుండా లక్షా 40వేలు నగదును పట్టుకెళ్తున్న వ్యక్తిని స్పెషల్ ఫ్లెయింగ్ స్క్వాడ్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని నగదును సీజ్ చేశారు. ఈ మేరకు టూటౌన్ సీఐ కోరాడ రామారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అయ్యకోనేరు సమీపంలో చిల్లపేట నుంచి వస్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి ఎటువంటి ఆధారాల్లేకుండా లక్షా 40వేలు నగదు పట్టుకుని వెళ్తుండగా స్పెషల్ ఫ్లెయింగ్ స్క్వాడ్ అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును సీజ్ చేశారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ వద్ద పెడతామని సీఐ తెలిపారు.

మద్యం మత్తులో సర్వజన ఆస్పత్రి ఉద్యోగి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి మద్యం సేవించి తాత్కాలిక పద్ధతిపై పని చేస్తున్న ఓ ఉద్యోగి విధులకు హాజరయ్యాడు. సదరు ఉద్యోగి ఓపీ విభాగంలో పని చేస్తున్నాడు. ఓపీ చీటి కావాలని రోగులు అడగగా ఉద్యోగి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో వారు ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి అధికారులు వెంటనే సిబ్బందితో అతన్ని ఆస్పత్రిలో చేర్పించి బ్లడ్ శాంపిల్ తీశారు. ఇదే విషయాన్ని ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఎన్.సురేష్‌బాబు వద్ద సాక్షి ప్రస్తావించగా మద్యం సేవించి ఉద్యోగి ఒకరు వచ్చారని, నిర్ధారణ కోసం అతని నుంచి రక్తనమూనాలు తీసి విశాఖపట్నంలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నట్టు చెప్పారు.

ప్రశాంతంగా పాలిసెట్

విజయనగరం రూరల్: 2024 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పాలిసెట్-2024 ప్రశాంతంగా ముగిసింది. ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 8,907 మంది దరఖాస్తు చేసుకున్నారు. విజయనగరం, గజపతినగరం, బొబ్బిలిలోని 24 కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 7,794 మంది హాజరు కాగా, 2,387 మంది గైర్హాజరయ్యారు.

- విజయనగరం జిల్లా కేంద్రంలోని 11 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,101 మంది హాజరు కాగా 419 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 2387 మంది, బాలికలు 1714 మంది పరీక్ష రాశారు.
- బొబ్బిలిలోని 7 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 2002 మంది హాజరు కాగా 346 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 1279 మంది, బాలికలు 723 మంది పరీక్ష రాశారు.
- గజపతినగరంలోని 6 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1691 మంది హాజరయ్యారు. 559 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 939 మంది, బాలికలు 752 మంది పరీక్ష రాశారు. అత్యధికంగా విజయనగరంలో 90.7 శాతం హాజరు నమోదు కాగా బొబ్బిలిలో 85.2 శాతం, గజపతినగరంలో 82.9 శాతం హాజరు నమోదైంది. పరీక్షల ఏర్పాట్లను జిల్లా కన్వీనర్, విజయనగరం ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు మౌలిక సదుపాయాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల జీవితాల్లో..
వేతన వెలుగులు

- అధికారంలోకి రాగానే వేతనాలు పెంచిన సీఎం జగన్
- జీఓ 114తో రెగ్యులర్ ఉత్తర్వులు
- జిల్లాలో 184 మందికి లబ్ధి

ఏళ్ల తరబడి ప్రభుత్వ కళాశాలల్లో వెట్టి చాకిరీ చేసిన కాంట్రాక్ట్ లెక్చరర్ల జీవితాల్లో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వేతన వెలుగులు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే వీరి వేతనాలు పెంచిన జగనన్న వారి కుటుంబాల్లో వెలుగులు నింపారు. దీంతో వీరు సంతోషంగా జీవిస్తున్నారు.



రాజాం : ప్రభుత్వ కళాశాలల్లో ఎంతో కాలంగా కాంట్రాక్ట్ లెక్చరర్లగా పని చేస్తున్న వారు తమను రెగ్యులర్ చేయాలని టీడీపీ పాలనలో చేసిన రోదనలు ఆ పార్టీ పట్టించుకోలేదు. కనీసం వారి వేతనాలు కూడా పెంచలేదు. టీడీపీ పాలనలో చాలీ చాలని వేతనాలతో కాలం నెట్టుకొచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు తెలుసుకున్నారు. చంద్రబాబు హయాంలో వీరికి నెలకు రూ.27,100లు ఉండగా జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి వీరి జీతాలను 57,100లకు పెంచారు. దీంతో వీరి జీవితాల్లో నూతనోత్సాహం వచ్చింది. ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్ట్ ఫ్యాకల్టీగా చేరేందుకు డిమాండ్ పెరిగింది. ఇదే సమయంలో ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ద్వారా వచ్చిన వినతులు పరిశీలించి రెగ్యులర్ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. జీఓ నంబరు 114ను విడుదల చేస్తూ కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు గతేడాది సెప్టెంబర్ 20న రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 2014 జూన్‌కు ముందు నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు అంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో రెగ్యులర్ కానున్నారు.

జిల్లాలో 184 మందికి లబ్ధి

జిల్లా వ్యాప్తంగా 146 మంది కాంట్రాక్ట్ జేఎల్‌లు పని చేస్తున్నారు. వీరంతా సీఎం తీసుకున్న నిర్ణయం ప్రకారం రెగ్యులర్ కానున్నారు. వీరితో పాటు ఈ జీఓ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లోని కాంట్రాక్ట్ లెక్చరర్లు కూడా రానున్నారు. వీరు జిల్లా మొత్తంగా 38 మంది వరకూ ఉన్నట్లు ఆ యూనియన్ గతంలో ఒక ప్రకటనలో పేర్కొంది. వీరందరి విద్యార్హత సర్టిఫికెట్లు, సీనియార్టీ, రిజర్వేషన్లు వంటి అన్ని పరిశీలనలు పూర్తి చేశారు. రెగ్యులర్ చేసే సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తాత్కాలికంగా రెగ్యులైజేషన్ నిలుపుదల చేయగా, ఎన్నికల అనంతరం వీరంతా రెగ్యులర్ కానున్నారు. దీంతో వీరి వేతనం రూ.80వేలు దాటి అందడంతో పాటు టీఏ, డీఏలు, ఇతర ప్రభుత్వ అలవెన్సులు అందనున్నాయి. వీరంతా ఇప్పుడు ఆర్థిక భరోసాతో జీవిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో వీరి జీవితాల్లో కొత్త కాంతులు కనిపిస్తున్నాయి.

చాలా మంచి నిర్ణయాలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చాలా మంచి నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం అనగానే అందరూ ఆశ్చర్యపడతారు. అవుట్‌సోర్సు, కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఎప్పటికైనా పర్మినెంట్ అవుతాయని ఆలోచిస్తారు. గత ప్రభుత్వాలు కాంట్రాక్ట్ ఉద్యోగులను పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం కాంట్రాక్ట్ ఉద్యోగులకు కొత్త జీవితాలు ప్రసాదించారు. వారు ఆర్థికంగా నిలదొక్కుకొనేలా చారిత్రాత్మక నిర్ణయం ప్రకటించారు.

– వంజరాపు నర్సింహులనాయుడు, రిటైర్డ్ గజిటెడ్ ఆఫీసర్, బొమ్మినాయుడువలస, రాజాం

ఉన్నత విద్యకు ప్రాణం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వ కళాశాలల అభ్యున్నతికి, అక్కడ పని చేసే లెక్చరర్ల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయడమనేది సాహసోపేత నిర్ణయం. ఇటువంటి నిర్ణయాలు సాధారణ నేతలకు సాధ్యం కాదు. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో వేలాది మంది కాంట్రాక్ట్ లెక్చరర్లుకు కొత్త జీవితం ఏర్పడింది.

పొట్నూరు మొయ్యన్నాయుడు, రిటైర్డ్ హెచ్‌ఎం, ఉపాధ్యాయ సంఘ మాజీ నేత, చింతలపేట, సంతకవిటి

గొప్ప వరం



కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయడమనేది చాలా మంచి ఆలోచన. కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఇదొక వరం. ఎంతో మంది చదువుకున్న యువతకు ఈ ప్రభుత్వం మీద, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీద మంచి నమ్మకం ఉంది. లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేశారు. లక్షలాది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు రెగ్యులర్ చేశారు. ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కలిగించారు. మళ్లీ సీఎంగా వస్తే ఎంతో మంది నిరుద్యోగ యువతకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

– లావేటి రమేష్, రాజాం

ప్రమాదంలో మానవ జీవితం

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి



సదస్సులో అతిథులతో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ టీవీ కట్టిమణి, విద్యార్థులు


విజయనగరం అర్బన్: వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా భూ సంరక్షణ మానవ మనుగడకు సవాల్ విసురుతోందని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం 2024 థీమ్ ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అనే అంశంపై స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో రాబోయే కొద్ది కాలంలో నీటి సంక్షోభాన్ని సృష్టించవచ్చునని అన్నారు. ఈ కారణంగా భూమిపై ప్రజల మధ్య అంతర్గత యుద్ధాలు, సంఘర్షణలను దారితీసే అవకాశం ఉందన్నారు. అలాగే భూమి మీద ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు ఎక్కువవుతోందని దీనివల్ల పర్యావరణం చాలా విపత్కర పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. దీన్ని నివారించడానికి జీవన శైలి మార్పు అవసరమని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన పంజాబ్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాఘవేంద్ర పి.తివారి మాట్లాడుతూ పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడటం వలన లిథోస్పియర్, హైడ్రోస్పియర్ మరియు అట్మాస్పియర్ నాణ్యత దెబ్బతింటుందన్నారు. నేల, గాలి, నీటి నాణ్యతను కాపాడేందుకు భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రజలు ప్రయత్నించాలని సూచించారు. కాలుష్య నివారణ, పర్యావరణాన్ని పరిరక్షణకు విద్యార్థి స్థాయి నుంచి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ముఖ్యఅతిథి అందజేసారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. జియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ ప్రసాద్ మన్నాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, డీన్ ప్రొఫెసర్ శరశ్చంద్రబాబు, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్‌బీకే పాడే, డాక్టర్ పి.శ్రీదేవి, డాక్టర్ బి.కోటయ్య, డాక్టర్ ఏవీ అప్పాసాబ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

బొబ్బిలి: పట్టణంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం, గ్రీన్‌బెల్ట్ సొసైటీ, యూటీఎఫ్ సంయుక్తంగా పదో తరగతికి అప్‌గ్రేడ్ అవుతున్న విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. స్థానిక వాసు జూనియర్‌కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓలు సీహెచ్ లక్ష్మణరావు, గొట్టాపు వాసు, నిర్వాహకులు కె.విజయగౌరి, వి.ఎస్.శర్మ, ఎస్వీ రమణమూర్తి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. చదుతోనే భవిత బంగారమవుతుందన్నారు. శిబిరంలో రౌతు వాసుదేవరావు, కిరణ్ కుమార్, ప్రసన్న కుమార్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండ ప్రచండం

- పెరిగిన వడగాడ్పులు
- అవస్థలు పడుతున్న చిన్నారులు, వృద్ధులు



పార్వతీపురం: ఉష్ణోగ్రతలు రోజు రోజుకు అధికమవుతున్నాయి. ఉదయం 10 గంటలనుంచి ఎండలు, వడగాడ్పుల తీవ్రత సాయంత్రంవరకు కొనసాగుతోంది. రాత్రి 7 గంటల ప్రాంతంలో కూడా వడగాడ్పులు ఉండడం గమనార్హం. రానున్న రోజుల్లో ఎండలు, వడగాడ్పులు తీవ్రత మరింత పెరిగే ఆస్కారం ఉన్నట్లు విపత్తుల నిర్వాహణాధికారులు పేర్కొంటున్నారు. వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో శనివారం సాలూరులో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో వృద్ధులు, చిన్నారుల అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	ఉష్ణోగ్రత డిగ్రీలు
బలిజిపేట	43.7
భామిని	43.7
గరుగుబిల్లి	44.7
గుమ్మలక్ష్మీపురం	42.0
జియ్యమ్మవలస	43.7
కొమరాడ	44.0
కురుపాం	42.0
మక్కువ	43.5
పాచిపెంట	43.5
పాలకొండ	43.7
పార్వతీపురం	43.2
సీతంపేట	44.1
సీతానగరం	44.7
వీరఘట్టం	43.7



పాలకొండ పట్టణంలో నిర్మానుష్యంగా రహదారి

అందరివాడు జగనన్న



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

- అబద్ధాలు, మోసాలే టీడీపీ అజెండా
- సాలూరు నియోజకవర్గంలో కోట్లాది రుపాయలతో అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

సాలూరు:

ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన అందరి ప్రజల మనస్సులను దోచుకున్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన సాలూరు పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన నవరత్నాల వల్ల రాష్ట్రం దివాలా తీస్తుందని విమర్శించిన చంద్రబాబు నేడు సూపర్‌సిక్స్ పథకాలంటున్నారని వాటి అమలుకు చాలా ఖర్చవుతుందన్నారు. ప్రజలను మోసం చేసింది ప్రతిపక్ష నేత చంద్రబాబు అని ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మరోసారి మోసం చేయడానికి టీడీపీ కూటమి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. అబద్ధాలు, మోసపూరిత మాటలే చంద్రబాబు 14 ఏళ్ల పాలన అని విమర్శించారు. గత పాలనలో ప్రజలకు చేసిన మంచిని టీడీపీ చెప్పలేకపోతుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల అజెండా జగన్‌మోహన్‌రెడ్డిపై అబద్ధాల దాడిచేయడమేనని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థను అనేక రకాలుగా విమర్శించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు నేడు మళ్లీ యూటర్న్ తీసుకుని, రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 65 లక్షల మంది పింఛన్ దారుల తిరగబడతారని భావించే నేడు వలంటీర్లపై చంద్రబాబు ప్రేమకురిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ కూటమిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ధీమా వెలిబుచ్చారు. 2019 ఎన్నికల ఫలితాలే మళ్లీ పునరావృతం కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాలూరు నియోజకవర్గం అభివృద్ధి కోసం రాజన్నదొర చేసిన కృషి అనిర్వచనీయమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి గిరిశిఖర గ్రామాలకు రోడ్లు, వంతెనలు, వందపడకల ఆస్పత్రి, సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ తదితర కోట్లాది రుపాయలతో అభివృద్ధి పనులు చేయించారని వివరించారు. ప్రజలకు మంచి చేయడమే అజెండాగా పనిచేస్తున్న రాజన్నదొరను, అరకు ఎంపీ అభ్యర్థిని తనూజారాణిలను గెలిపించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సమన్వయంతో పనిచేసి వైఎస్సార్‌సీపీకి అఖండ మెజారిటీ అందించాలని విజ్ఞప్తి చేశారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిహామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తారని, ఇప్పటికే ఇది రుజువైందన్నారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి ప్రజలను మరోసారి మోసం చేయడానికి అబద్ధపు మాటలు, హామీలతో వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా, సమన్వయంతో పనిచేసి కూటమి అబద్ధపు హామీలు, మాటలను ఎండగడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రజాసంక్షేమం, అభివృద్ధి పాలనను వివరిస్తూ ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయురారోగ్య ప్రాప్తిరస్తు

- విద్యార్థులకు ఆరోగ్యభాగ్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో క్రమం తప్పకుండా హెల్త్ డ్రైవ్
- ప్రత్యేక యాప్‌లో ఆరోగ్య వివరాల నమోదు
- జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వైద్యశిబిరాలు
- 3,90,507 మంది విద్యార్థులకు స్క్రీనింగ్



దోకిశీల పాఠశాలలో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బంది (ఫైల్)

పార్వతీపురంటౌన్:

విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించింది. విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమం చేపట్టింది. ప్రతి పాఠశాలకు వైద్య సిబ్బందిని పంపించింది. విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి వారి ఆరోగ్య వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన పాఠశాలల హెల్త్ యాప్‌లో నమోదు చేయించింది. వ్యాధులతో బాధపడేవారికి ఉచిత వైద్యసేవలతో ఆరోగ్య భద్రత కల్పించింది. ఈ కార్యక్రమంలో భాగంగా గత నాలుగేళ్లుగా పార్వతీపురం మన్యం జిల్లాలో 397 మంది ఏఎన్ఎంలు పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. 1698 పాఠశాలల్లోని 3,90,507 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించారు. ఆయా వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ప్రతి ఏడాది 15 రోజుల పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ హెల్త్ డ్రైవ్ నిర్వహించారు.

పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా..

జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల్లో 40 శాతం గిరిజన గ్రామాలకు చెందిన వారు. వారిలో సికెల్‌సెల్ ఎనీమియా, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఏఎన్ఎంలు పరీక్షలు నిర్వహించారు. వ్యాధుల గుర్తింపు, వైద్యపరీక్షలపై ఏఎన్ఎంలకు జిల్లా వైద్యాధికారులు శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల ఎత్తు, బరువు వంటి వివరాలు సేకరించడంతో పాటు రక్త హీనతను గుర్తించేందుకు హిమోగ్లోబిన్ పరీక్ష చేశారు. సికిల్‌సెల్ ఎనీమియా సమస్య ఉన్న విద్యార్థులను గుర్తించి నివారణకు పూర్తి చర్యలు చేపట్టారు. రక్తహీనతను గుర్తించి విద్యార్థులకు ఐరన్ పోలిక్ ఔషధాలను వైద్యశాఖ సరఫరా చేసింది. వైద్యపరీక్షల్లో ఆరోగ్య సమస్యలున్నట్టు గుర్తించిన విద్యార్థులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించారు.

పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ..

విద్యార్థుల ఆరోగ్య వివరాలతో పాటు పాఠశాలల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలు తీరు, తాగునీటి వసతులు తదితర వివరాలను హెల్త్ యాప్‌లో నమోదు చేశారు. కౌమార బాలికల పరిశుభ్రతలో భాగంగా ప్రభుత్వం నేప్‌కిన్లను పంపిణీ చేసింది.

గతంలో పాఠశాకు పంపాలంటే భయం



గతంలో మా అబ్బాయి యశ్వంత్‌ను పాఠశాలకు పంపాలంటే భయంగా ఉండేది. పాఠశాలలో సరైన భోజనం ఉండేది కాదు. ఎప్పటికప్పుడు ఆరోగ్య సమస్యలు వచ్చేవి. జగనన్న ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. విద్యావ్యవస్థలో పూర్తిగా మార్పులు తీసుకువచ్చారు. ఆరోగ్యవంతమైన మధ్యాహ్న భోజనం, క్లాస్ రూమ్‌లో పరిశుభ్రత కూడిన ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఏటా పాఠశాలలోనే ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు.

– శ్రీదేవి, విద్యార్థి తల్లి, పార్వతీపురం

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకే..



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పాఠశాలల్లోనే పరీక్షించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. చిన్నవయసులోనే ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఆరోగ్యకర చదువులకు ఇది దోహదపడుతుంది. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు.

– యాండ్రాపు మంగ, పేరెంట్స్ కమిటీ చైర్మన్, లక్ష్మీనారాయణపురం



బాలగుడబ పాఠశాలలో స్కూల్‌హెల్త్ కార్యక్రమం

విద్యా సంవత్సరం	హెల్త్ స్క్రీనింగ్ చేసిన విద్యార్థులు
2020-21	96,149
2021-22	98,120
2022-23	99,110
2023-24	97,128

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గతంలో పాఠశాలల్లో కనీస వసతులు ఉండేవి కావు. విద్యార్థులను పట్టించుకున్న దాఖలాలు లేవు. 2019 జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. అంతే కాకుండా ఏటా క్రమం తప్పకుంగా మా పాప గాయత్రి చదువుతున్న మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన మాత్రలు అందజేశారు.

– గంగ, విద్యార్థిని తల్లి, పార్వతీపురం

జిల్లాలో స్కూల్ హెల్త్ డ్రైవ్ వివరాలు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు	1698
హెల్త్ డ్రైవ్‌లో పాల్గొన్న ఏఎన్ఎంలు	397 మంది
వైద్యులు	80 మంది